పట్టణాభివృద్ధిలో ప్రాధాన్యమేది?

- అస్తవ్యస్తంగా నిధులు వినియోగం
- శివారు కాలనీలను పట్టించుకోని వైనం
- దృష్టి సారించాలంటున్న పట్టణవాసులు



హుస్నాబాద్ పట్టణంలోని నేతాజీ కాలనీలో మట్టిరోడ్డు

హుస్నాబాద్: మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరయ్యే నిధులతో చేపట్టే పనులు అస్తవ్యస్తంగా మారాయి. వార్డుల్లో ప్రాధాన్యత గల పనులను గుర్తించకుండా ఇష్టారీతిన పనులు చేపడుతున్నారని విమర్శలున్నాయి. ఉన్న రోడ్లపైనే మళ్లీ రోడ్డు వేస్తున్నారని, లేని చోట అసలు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అభివృద్ధికి మంజూరైన నిధులకు లెక్కాపత్రం లేకుండా పోతోందని, అడిగితే అక్కడ రోడ్లు వేశాం, ఇక్కడ మురికి కాల్వలు నిర్మించామంటూ అధికారులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు తూట్లు

- పట్టణంలో కొంత మంది కౌన్సిలర్లు బినామి పేర్లతో పనులు చేపడుతున్నా వారిని చూసి అధికారులు సైతం మౌనం వహిస్తున్నారు.
- రోడ్డు పనులు చేపడితే ఎక్కడ నుంచి ఎక్కడకు రోడ్డు వేయాలని స్పష్టంగా ఎంబీ బుక్‌లో నిర్దిష్టంగా రాసేవారు.



11వ వార్డులో నిర్మించిన సీసీరోడ్డు

- మన్నికగా ఉండే సీసీరోడ్లు మూన్నాళ్లకే కంకర తేలి పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు.
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.
- మట్టి రోడ్లను విడిచిపెట్టి ఉన్న చోట రోడ్లు వేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలున్నాయి.
- పట్టణ శివారులో నేతాజీ నగర్, బీసీ కాలనీల్లో ఇంకా మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. ఈ వార్డుల్లో మురికి కాల్వలు అసలే లేవు.
- బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పాటు ఇటీవల ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేశారు.
- మంజూరైన నిధులతో అన్ని వార్డులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

అవసరమైన చోట నిర్మాణం



పట్టణంలోని ఆయా వార్డుల్లో అవసరాన్ని గుర్తించి నిధులు కేటాయిస్తున్నాం. మట్టి రోడ్లు ఉన్న కాలనీల్లో సీసీరోడ్లు, మురికికాల్వలు, కూడళ్ల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేపడతాం. ప్రాధాన్యత ప్రకారం నిధులు ఖర్చు చేస్తాం.

– ఆకుల రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్, హుస్నాబాద్

ప్రధాన కూడళ్లు...

గతంలో మంత్రి హరీశ్‌రావు ప్రధాన కూడళ్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి పట్టణంలో ఏడు కూడళ్లల్లో అధికారులతో సర్వే చేయించారు. కానీ అప్పటి పాలకవర్గం ఫాలోఅప్ చేయలేదు. ప్రధాన రోడ్లల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండా సర్పంచ్ దారావత్ శివలాల్‌నాయక్ గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు అతనిపై చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ జాటోత్ సరోజ, గ్రామస్తుడు ధారవత్ సురేశ్‌నాయక్ జిల్లా కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఖాజామొయినుద్దీన్‌తో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఫిర్యాదు మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుల వాంగ్మూలాలు సేకరించి రికార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి భూక్య మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారికి ఇష్టమైన వారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు క్యూలైన్‌లో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్నాలు, బోనాలు, ఒడిబియ్యం పోసి మొక్కులు సమర్పించుకున్నారు. హరితహారం మొక్కలు, చలువ పందిర్ల నీడలో వంటలు చేసుకున్నారు.



ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

మధ్యాహ్నం వరకే కంటి వెలుగు

- కూలీ పనులకు వెళ్లిన వారికి దొరకని వైద్యులు
- సకల సౌకర్యాలు కల్పించిన నిలకడ లేని వైనం

హుస్నాబాద్‌రూరల్: పల్లెటూరి వ్యవసాయ కూలీలకు స్వచ్ఛమైన కంటి వెలుగులను ఇవ్వాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాలు గ్రామాల్లో కొనసాగుతున్నాయి. గ్రామంలోని పేదలందరికీ పరీక్షలు చేయాల్సిన వైద్య బృందం కేలం రోజువారీ లక్ష్యంతో విధులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. మంగళవారం తోటపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమానికి వెళ్లిన వైద్య సిబ్బంది 12 గంటల వరకే 150 మందికి కంటి పరీక్షలు చేసినట్లు ఆశకార్యకర్త వద్ద ఉన్న జాబితాను తీసుకొని ఊరులోనే లేని వారి పేర్లను నమోదు చేసుకున్నారు. 50 మందికి కంటి పరీక్షలు చేసి 150 మంది పేర్లను నమోదు చేసుకోవడంతో సర్పంచ్, గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. వైద్య సిబ్బందికి కావాల్సిన సకల సౌకర్యాలు భోజనం, టీ, కూలర్, అల్పాహారం వారు అడిగినవన్నీ సర్పంచ్ ఏర్పాటు చేయించాడు. మా ఊరు ప్రజలకు కంటి పరీక్షలు చేస్తున్నారని సంతోషపడ్డాడు. పనులకు వెళ్లిన కూలీలు మధ్యాహ్నం సమయానికి ఇంటికి చేరుకొని కంటి పరీక్షలు చేసుకుందామని కేంద్రానికి వస్తే భోజనాలు చేసిన వైద్య బృందం పెట్టే సర్దుకొని వెళ్లిపోయారు. గ్రామస్తులు సర్పంచ్ దగ్గరకు వచ్చి అడగడంతో అప్పటికే వైద్య సిబ్బంది హుస్నాబాద్‌కు చేరుకున్నారు. ఊరులో ఉండే వారికి కంటి పరీక్షలు చేయకుండా ఊరులో లేనివారికి కంటి పరీక్షలు చేసినట్లు రాసుకోవడం ఏమిటని సర్పంచ్ పోలవేని లతసంపత్, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి విధులపై నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకొని గ్రామంలోని పేదలందరికీ కంటి పరీక్షలు చేయాలని కోరుతున్నారు.



తోటపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

‘పాస్టర్ల కమిటీ నియామకాన్ని ఖండిస్తున్నాం’



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బి.ఇసాక్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏలిము ప్రార్థన మందిరంలో మంగళవారం ఏడు మండలాల పాస్టర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ అధ్యక్షుడు ఇసాక్ మాట్లాడుతూ.. మూడునెలల క్రితం ఫిబ్రవరి 17న పాస్టర్ నవీన్‌కుమార్ సమక్షంలో నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఎన్నుకున్నారన్నారు. కాగా ఈ నెల 9న పాస్టర్ బి.నవీన్‌కుమార్ తనకు అనుకూలమైన కొంతమంది పాస్టర్లను పిలిపించుకొని తమకు తామే కమిటీని నిర్ణయించుకొని ప్రకటించాడని ఆయన తెలిపారు. దీనిని నియోజకవర్గ పాస్టర్లు ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజలు, ప్రభుత్వ అధికారులు, క్రైస్తవులు గమనించాలని ఇసాక్ కోరాడు. హుస్నాబాద్ నియోజకవర్గ పాస్టర్ నూతన కమిటీ అధ్యక్షుడిగా పాస్టర్ ఇసాక్ (కోహెడ), ఉపాధ్యక్షులుగా ప్రేమ్‌కుమార్ (జిల్లుల), విజయ్‌కుమార్ (చిగురుమామిడి), కార్యదర్శిగా సాల్మన్ (హుస్నాబాద్), సంయుక్త కార్యదర్శులుగా డేవిడ్ (అక్కన్నపేట), ప్రభుదాస్ (గట్లనర్సింగాపూర్), కోశాధికారులుగా ప్రవీణ్, ఉదయ్‌కుమార్ (ఎలబోతారం), చైర్మన్‌గా మలాకి (హుస్నాబాద్), గౌరవ అధ్యక్షుడిగా బాబు(కోతులనడుమ), ముఖ్య సలహాదారుడిగా మోజెస్ (హుస్నాబాద్)లను ఎన్నుకున్నామని ఇసాక్ తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అద్దాలు అందిస్తున్న ఎంపీపీ కరుణాకర్

చేర్యాల(సిద్దిపేట): కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ముస్త్యాల గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమర్ సుల్తానా, ఉపసర్పంచ్ మీస రవితేజ, పీఏసీఎస్ డైరెక్టర్ బైకని కమలాకర్, రైతుబంధు కో–ఆర్డినేటర్ రేపాక నాగేశ్వర్, గ్రామ యూత్ అధ్యక్షుడు పెద్దింటి మహేందర్, పంచాయతీ కార్యదర్శి నవ్య, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని హనుమతండా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ రేణుక ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



రాయపోల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

దుబ్బాక: మన ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని రాయపోల్ వైద్యాధికారి మహరాజ్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయపోల్ మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశవర్కర్లతో కలిసి పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. గ్రామాలను సంపూర్ణ పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచినట్లయితే దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రజలందరూ ప్రతీ శుక్రవారాన్ని డ్రై డేగా నిర్వహించాలని కోరారు. వ్యక్తిగత మరుగుదొడ్లను తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాము, మంజు, నీరజ, ప్రవీణ్, లింగం, ఆశకార్యకర్తలు యాదమ్మ, భాగ్య తదితరులున్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్: శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని ఏరియా ఆస్పత్రి నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు రాహుల్, ఐశ్వర్యలు మాట్లాడుతూ.. డెంగీ లక్షణాలు, నివారణ చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ కాశీం, హెచ్‌ఈ రజిని, సూపర్‌వైజర్ సాయమ్మ, సీహెచ్‌ఓ రవికుమార్, హెల్త్ అసిస్టెంట్‌లు వాసుదేవ్, నాగరాజు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

దుబ్బాకటౌన్: పట్టణంలో ఈ నెల 21 నుంచి జరగనున్న రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలకు రావాలని కోరుతూ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బాలేష్‌గౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, దుర్గేందర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, నేహాల్‌గౌడ్ ఉన్నారు.



ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్ గ్రామంలో సోమగారి నాగిరెడ్డి (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) తల్లి లక్ష్మి అనారోగ్యంతో మంగళవారం మరణించింది. దీంతో విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అదే విధంగా గ్రామ మహిళా మండలి తొలి అధ్యక్షురాలు కుమ్మరి లచ్చవ్వ రెండు రోజుల క్రితం మరణించింది. ఆమె కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, స్వామిరెడ్డి, కల్యాన్‌దాస్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

◆ సీసీరోడ్డు పనులు ప్రారంభం

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట 11వ వార్డులో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నందాల శ్రీజశ్రీకాంత్, కూరపాటి బంగారయ్య తదితరులు ఉన్నారు.

◆ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళా గ్రూపు సంఘాల అభ్యున్నతికి పాటు పడుతున్న వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు కోరారు. వీవోఏలు చేపట్టిన సమ్మెకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీవోఏలకు కనీస వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా నాయకులు మహేశ్, యమున, జమున, మంగమ్మ, పరశురాములు, నర్సింలు, కల్పన పాల్గొన్నారు.

◆ సబ్సిడీపై జీలుగ విత్తనాలు

హుస్నాబాద్‌రూరల్: రైతులు పెట్టుబడులను తగ్గించడానికి పచ్చిరొట్ట సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం పచ్చిరొట్ట సాగు లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తుందని, రైతులందరూ పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తెచ్చుకొని విత్తనాలు తీసుకోవాలని చెప్పారు. 30 కిలోల బస్తాకు సబ్సిడీతో రూ.850లు చెల్లించాలన్నారు.కేడీసీఎంఎస్, ఆగ్రోస్ సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



సిద్దిపేటరూరల్: వాలీబాల్ క్రీడాకారులతో సుడా చైర్మన్, ఎంపీపీ తదితరులు



నంగునూరు(సిద్దిపేట): క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాజుగౌడ్

సిద్దిపేటరూరల్: యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సీఎం కప్ పేరుతో గ్రామాల్లో క్రీడలు నిర్వహిస్తుందని సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇర్కోడ్ మోడల్ స్కూల్‌లో సీఎం కప్ క్రీడలను సుడా చైర్మన్, ఎంపీపీ శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

నారాయణరావుపేట మండల కేంద్రంలో..

నారాయణరావుపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రాంగణంలో సీఎం కప్ క్రీడలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్, సర్పంచ్‌లు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభను మెరుగుపర్చుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని రాజగోపాలపేట ఎస్‌ఐ రాజుగౌడ్ అన్నారు. మంగళవారం నర్మెట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం క్రీడాపోటీలు ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమని క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అజీజ్, ఎంపీటీసీ బాబు, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్, ఎంఈవో దేశిరెడ్డి, నారాయణ, పద్మారెడ్డి పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో మండల స్థాయి క్రీడలు రెండోరోజు కొనసాగాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ రాము, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువ ఉండకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ధాన్యం తరలించడానికి లారీల కొరత లేదని ముందు కూడా ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు.

ఇటుక బట్టీలను సీజ్ చేయాలి

- చేర్యాల మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రజాప్రతినిధుల డిమాండ్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పలు గ్రామాల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను వెంటనే సీజ్ చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల స్థాయిలోని వివిధ శాఖల పురోగతిపై జరిగిన చర్చలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఇచ్చిన శ్రీనిధి రుణాలు మండల పరిధిలోని 2 గ్రామాల్లో ఎనిమిది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీంతో ఆ గ్రామాల మహిళలకు శ్రీనిధి రుణాలు అందడం లేదని సభ దృష్టికి తీసుకురాగా ఎంపీపీ కరుణాకర్ స్పందిస్తూ వెంటనే పెండింగ్ రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా 4 సంవత్సరాలుగా గ్రామాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన ఖర్చుల వివరాలను అందించాలని ఆదేశించారు. విద్యుత్, రెవన్యూ శాఖలపై జరిగిన చర్చలో మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయని సభ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎంపీపీ, ఎంపీడీఓ అనుమతులు లేని బట్టీలకు పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేసి సీజ్ చేయాలని, అదేవిధంగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సూచించారు. మండల పరిధిలోని కడవేర్గు చెరువు ఎఫ్‌టీఎల్‌ను మట్టితో నింపి విక్రయించేందుకు పూనుకున్న రియల్టర్ల నుంచి చెరువు ఎఫ్‌డీఎల్‌ను కాపాడాలని రెవెన్యూ, ఐబీ అధికారులకు ఎంపీపీ సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గ్రామాల్లో పనులు చేయాలని అధికారులు చెప్పగా మండల పరిధిలోని వీరన్నపేట సర్పంచ్ కొండపాక భిక్షపతి స్పందిస్తూ పాత బిల్లులు చెల్లించే వరకు కొత్తపనులు చేయమని, అవసరమైతే రోడ్డుపై బైటాయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికి మండలంలోని ఆకునూరు, గుర్జకుంట, వేచరేణి సర్పంచ్‌లు మద్దతు పలికారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేసిన పనులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో బిల్లులు ఆలస్యమవుతున్నాయని అధికారులు బదులిచ్చారు. సమావేశానికి హాజరై గ్రామ సమస్యలు వివరించాల్సిన సర్పంచ్‌లు కొన్ని కారణాలతో హాజరుకాకపోవడంతో మండల పరిధిలోని నాగపురి, శభాష్‌గూడెం గ్రామ కార్యదర్శులు సందీప్, రాజులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తేవడం విశేషం. ఈ సమావేశానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకాగా ఫారెస్ట్, ఆర్అండ్‌బీ, ఫిషరీస్ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ తారిక్‌అన్వర్, ఎంపీఈఓ మహబూబ్‌అలీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణాకర్

క్లుప్తంగా

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మిరుదొడ్డి మోడల్ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ భారతీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కోదాంట్లో 40 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.tsmodelschools.com అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

మిల్లర్ల దోపిడీని అడ్డుకోవాలి



ధర్నా చేస్తున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయిస్తే తరుగు పేరుతో మిల్లర్లు కోతలు పెట్టి రైతులకు వాతలు పెడుతున్నారని వైఎస్సార్‌టీపీ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం పందిల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి అక్కడ రైతుల సమస్యలను తెలుసుకొని రైతులతో కలిసి రోడ్డుపై ధర్నా చేపట్టారు. రైతులు ఇచ్చిన ధాన్యంలో ఎలాంటి కోతలు లేకుండా మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో జానకీరాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఏపీఎం కిషన్

దుబ్బాక: ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని దౌల్తాబాద్ ఏపీఎం కిషన్ ఐకేపీ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని గోవిందాపూర్, గువ్వలేగి, ఉప్పరపల్లి, కోనాయిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. కొనుగోలులో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ ఉపయోగకరం



సర్టిఫికెట్లు పొందిన వారితో టూటౌన్ సీఐ రవికుమార్

సిద్దిపేటకమాన్: ఆపద సమయంలో ఉన్న వారిని ఆదుకోవడానికి సీపీఆర్‌పై శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబా హోటళ్ల నిర్వాహకులకు, ఇతర దుకాణాదారులకు సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పాల్గొన్న 12 మందికి, పోలీస్ సిబ్బందికి పోలీస్ స్టేషన్‌లో సీఐ రవికుమార్ మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్‌ఐ భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు

కొండపాక(గజ్వేల్): భూసారం పెంపుతో అధిక దిగుబడులు పొందవచ్చని గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్ పేర్కొన్నారు. మండలంలోని వెలికట్ట క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో మంగళవారం పచ్చిరొట్ట, జీలుగ సబ్సిడీ విత్తనాల కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబూనాయక్ మాట్లాడుతూ.. ప్రతీఏడు వర్షాకాలంలో భూములు సారవంతం అయ్యేలా రైతులు చర్యలు చేపట్టాలన్నారు. 65 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట, జీలుగ, జనుము విత్తనాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ విత్తనాలతో భూసారం పెరుగుతుందన్నారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో ఉన్న 6 ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాల్లో 300 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎకరాకు 15కిలోల విత్తనాలు సరిపోతాయన్నారు. 30కిలోల బస్తా ధర రూ.843 ఉంటుందన్నారు. అవసరమున్న రైతులు ఆగ్రోస్ దుకాణాల్లో పట్టాదార్ పాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు అందజేసి విత్తనాలను తెసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అమ్ముల రమేశ్, శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిణి, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ దుర్గయ్య, ఆగ్రోస్ కేంద్రం నిర్వాహకుడు రాంచంద్రారెడ్డి, రైతులు ఆంజనేయులు, నాంపల్లి, కనకయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.